క్లుప్తంగా

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్ ఇస్తున్న దత్తు

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు ఆరె విఠల్‌కు తూమోల్ల ముత్తన్న సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ట్రైసైకిల్ అందించారు. కాలనీకి చెందిన దివ్యాంగుడికి సేవా సమితి ఆధ్వర్యంలో తనవంతుగా సాయం అందించినట్లు సేవా సమితి అధ్యక్షుడు తూమోల్ల దత్తు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

ప్రమాదకర గుంతలు పూడ్చివేయించిన పోలీసులు



గుంతలు పూడ్చివేయిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని గండిరామన్న హరిత వనం నుంచి చించోలి(బి)ఎక్స్‌రోడ్డు వరకు పాతఎన్‌హెచ్ 44పై ఉన్న ప్రమాదకర గుంతలను రూరల్‌సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ పూడ్చివేయించారు. వాహనదారులు అదుపు తప్పి కింద పడుతుండటంతో మొరం పోయించి గుంతలను పూడ్చివేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గోరింటాకు వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని గాయిత్రీ బ్రాహ్మణసంఘం మహిళలు ఆదివారం ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా అత్తాకోడళ్లు, ఆడపడుచులు సందడిగా గడిపారు. గోరింటాకుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను పలువురు వివరించారు. కార్యక్రమంలో విష్ణుంబట్ల శుభాంగి, సంతోషిని, నిమ్మగడ్డ నిఖిత, సరస్వతి, వీణ, వాసవి, సృజన తదితరులున్నారు.

రైతుబీమాలో తప్పులు సరిచేసుకోండి

లక్ష్మణచాంద: రైతుబీమాలో ఈనెల 30లోగా తప్పులను సరిచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నామినీ ఆధార్‌లో మార్పులు, నామినీ మృతి చెందితే వివరాలు సరిచేసుకోవాలని రైతులను కోరారు. తమ క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని ఆయన అన్నదాతలకు సూచించారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కుభీర్:మండల కేంద్రంలో జివ్‌నోజి జీవన్, బోయిడి రాజేశ్వర్, లక్ష్మణ్, బడేమియా ఇటీవల మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పరామర్శించారు. వారి మృతికి కారణాలను తెలుసుకొని సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.విఠల్, గులాబ్, బి.గంగాశేఖర్, బి.శేఖర్, ఉప్పు దత్తాత్రి, సాయినాథ్, సంటి తదితరులు ఉన్నారు.

ఘనంగా మైసమ్మ పండుగ

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్‌లో గల్లిమైసమ్మ పండుగను ఆదివారం గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బోనమెత్తి.. అమ్మకు మొక్కి

ఆషాఢమాసం నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి.. ప్రజలు, పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.



నిర్మల్‌లోని రవినగర్ నుంచి మారెమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు



నిర్మల్‌లోని మహాలక్ష్మి ఆలయం వద్ద కోడిపుంజుతో మొక్కు తీర్చుకుంటున్న భక్తుడు



భైంసాలో బోనం ఎత్తుకున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



బాసరలో..

బాసర: మండల కేంద్రంలోని హంసవాహిని విద్యాలయంలో బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారు, పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ దేశాయ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పురాతన బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. వారి వెంట తాజా మాజీ ఎంపీపీ కొరిపల్లి రామేశ్వరరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పీవీ రమణ రెడ్డి, తారక రఘువీర్, గాంగోని బురాజ్, వంశీ, అరవింద్, ప్రశాంత్ ఉన్నారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలో ఆయా కాలనీల మహిళలు బోనాలతో మహాలక్ష్మి మందిరం, గట్టు మైసమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ గట్టు మైసమ్మ ఆలయంలో బోనం సమర్పించారు. పట్టణ సీఐ రాజారెడ్డి సైతం పూజలు చేశారు. బి.గంగాధర్, సతీశ్‌రావ్, తదితరులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని విజయసాయి పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. పాఠశాల నుంచి మహాలక్ష్మి ఆలయం వరకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిర్మల్‌లోని బంగల్‌పేటలో అమ్మవారిని దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కుంటాల: బోనాలతో ఆలయానికి వెళ్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద క్యూ కట్టిన భక్తులు

బురద రోడ్లతో అవస్థలు



లక్ష్మణచాందలో తహసీల్దార్ కార్యాలయం పక్కన అధ్వానంగా రోడ్డు



మండల కేంద్రంలో బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

లక్ష్మణచాంద: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లక్ష్మణచాంద మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా వర్షపునీరు నిలిచి బురద ఏర్పడింది. అంతర్గత రోడ్లపై నిలిచిన బురదను, వర్షపునీటిని పంచాయతీ సిబ్బంది, అధికారులు తొలగించడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి మండల కేంద్రంలోని అంతర్గత రోడ్ల సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ నుంచి ఖానాపూర్ మార్గంలోని రెంకోనివాగు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు మార్గంలో నిలిపివేసిన రాకపోకలను వెంటనే పునరుద్ధరించాలని ఎంసీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాత్కాలిక రోడ్డు నుంచి రాకపోకలు లేకపోవడంతో 20కిపైగా గ్రామాల ప్రజలు అధిక రవాణా ఛార్జీలు చెల్లించి ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. వంతెనలు సకాలంలో పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు అల్లెపు పీటర్, బుక్య సురేందర్, నాయకులు గణేశ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విగ్రహ నిర్మాణ కమిటీ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్మాణ కమిటీ సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేసినట్లు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను తన నివాసంలో కలిశారు. పంచలోహాలతో కూడిన 21 అడుగుల శివాజీ విగ్రహం ఏర్పాటు విషయమై కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. విగ్రహ ఏర్పాటుకు గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే వ్యవహరించనుండగా.. తనవంతు సహకారం అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

'అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయండి'

ఖానాపూర్: పెంబి మండలంలోని వరద ప్రభావిత గ్రామాల్లో బోధించే ప్రభుత్వ ఉపాధ్యాయులను అక్రమ డిప్యూటేషన్‌లతో వివిధ మండలాలకు పంపడం సరికాదని.. వాటిని రద్దు చేయాలని ఛాత్రాయుత సంఘర్షణ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.అరవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పెంబి మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉన్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



కుభీర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్

కుభీర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించి బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమన్వయంతో పని చేసి అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పల్సి నాయకుడు జి.విఠల్ మృతికి సంతాపం తెలిపారు. ఈసందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ వసంతరమేశ్, మాజీ ఎంపీపీ యోగితకమ్‌లేశ్, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు బోడిగాం గంగాశేఖర్, ఏశాల దత్తాత్రి, వెంకటస్వామి, అభిషేక్, బొమ్మెడి మల్లేశ్, రావుల సంటి, మ్యాకల రాజు, బి.శేఖర్, డాక్టర్ గణపతి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసి స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించాలని ఆ పార్టీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జయసాగర్‌రావు, నాయకులు నారాయణ్‌రెడ్డి, రాజేశ్‌బాబు, లక్ష్మణ్‌రావు, శ్రీధర్, సాయన్న పాల్గొన్నారు.

'విద్యార్థులతో పనులు చేయించొద్దు'



బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పాఠశాలల్లో విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించొద్దని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని జేకే నగర్ మహాత్మా జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాలను చైర్మన్.. సీడీపీవో సరితతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులతో వంట పనులు చేయిస్తూ.. వారికి సక్రమంగా భోజనం పెట్టడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు దోమలతో ఇబ్బందులు పడుతున్నారని.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. వారి వెంట నాయకులు నాయిని సంతోశ్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

ఖానాపూర్: విద్యారంగంతోపాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో సీఐటీయూ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాధ, లక్ష్మి, మంజుల, రజిత, సరిత, శంభు, తదితరులు ఉన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్‌లోని ఎల్లమ్మ ఆలయం వద్ద 15 రోజుల కిందట తాగునీటి పైపులైన్ పగలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆదివారం సిబ్బందిని తీసుకెళ్లి మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో నాయకులు నాయిని సంతోశ్, తదితరులున్నారు.

గుంతలతో జర పైలం

ఖానాపూర్: పట్టణంలో ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. స్థానిక లారీ అడ్డాతోపాటు పాతబస్టాండ్ ప్రాంతం, ఆనంద్ షాపింగ్‌మాల్, డీఎస్ మార్ట్, అటవీశాఖ కార్యాలయం తదితర చోట్ల రోడ్డుపై ప్రమాదకర గుంతలే దర్శనమిస్తున్నాయి. పలుమార్లు గుంతలను మట్టితో పూడ్చినప్పటికీ అదే పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అందులోని మట్టి కొట్టుకుపోయి గుంతలు మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. గుంతల్లో నిలిచిన వర్షపునీటితో వాటి లోతు తెలియక వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చేందుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు.



అటవీశాఖ కార్యాలయం ఎదుట...



పట్టణంలోని డీఎస్‌మార్ట్ ముందు రోడ్డుపై గుంతలు



లారీ అడ్డాలోని రోడ్డుపై..

ఘనంగా వర్షావాస్

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో ఉన్న బుద్ధవిహార్‌లో బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం వర్షావాస్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ గడపాలే హాజరై వర్షావాస్ కార్యక్రమ ప్రాధాన్యం, విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. సంస్కార విభాగం ఉపాధ్యక్షులు ఆబారావు వాగ్మారే, జిల్లా పదాధికారులు, బౌద్ధ ఉపాసకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థలం విరాళం



స్థలదాతను సన్మానిస్తున్న కాలనీవాసులు

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్ కాలనీలో మహాపోచమ్మ ఆలయ నిర్మాణనికి లాలుయాదవ్ తన భూమిలోని ఒక ప్లాటును విరాళంగా అందించారు. ఈ మేరకు ఆదివారం సదరు స్థలంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, కాలనీవాసులు స్థల దాత లాలుయాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్రావుపటేల్, విఠల్ పటేల్, మోహన్, అవదూతపటేల్, సతీశ్, లక్ష్మణ్, పరశురాం, వెంకటేశ్, అశోక్ పటేల్, శ్రీనివాస్, హనుమంతరావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం



జ్ఞాపిక అందుకున్న ప్రధానోపాధ్యాయులు

భైంసాటౌన్: ఇటీవల పలు శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదివారం హైదరాబాద్‌లోని విద్యాపీఠంలో నిర్వహిస్తున్న వర్షారంభ సమావేశాల్లో ఘనంగా సన్మానించారు. ఈమేరకు భైంసాలోని కిసాన్‌గల్లి, సుభద్రవాటిక శిశుమందిరాల ప్రధానోపాధ్యాయులు నామాల భోజన్న, బందెల దేవేందర్‌ను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు.